


EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
సోమవారం
25 నవంబర్ 2024
పేజీలు: 02

# జీహెచ్ఎంసీలో హౌసింగ్ సొసైటీలకు భూ కేటాయింపులు రద్దు చేసిన సుప్రీంకోర్టు



జీహెచ్ఎంసీ పరిధిలో హౌసింగ్ సొసైటీలకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. హౌసింగ్ సొసైటీలకు కేటాయించిన భూ కేటాయింపులను రద్దు చేసింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ సంజీవ్ కన్నా నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టు సొసైటీలకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వాలు భూములు కేటాయించిన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వాలు బుక్ కేటాయింపులు చేయడాన్ని సవాల్ చేస్తూ రావు బీ చెలికాని సుప్రీకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై దేశ అత్యున్నత న్యాయస్థానం తుది తీర్పును వెలువరించింది. కాగా, జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలో సభ్యులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది సెప్టెంబర్ 8న హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఇండ్ల స్థలాల కేటాయింపు పత్రాలను సీఎం రేవంత్ రెడ్డి అందించారు. అయితే సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో హౌసింగ్ సొసైటీలు పొందిన భూముల విషయమై సందిగ్ధం నెలకొన్నది.



# నా ఫ్యాన్స్ అంటే నాకు పిచ్చబ్బా

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో రాబోతున్న 'పుష్ప 2 ది రూల్' కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. డిసెంబర్ 05న ఈ సినిమా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ప్రస్తుతం ప్రమోషన్ కార్యక్రమాలను ముమ్మరంగా చేస్తున్నారు మేకర్స్. ఇందులో భాగంగా నిన్న రాత్రి చెన్నై వేదికగా పుష్ప 2 వైల్డ్ ఫైర్ ఈవెంట్ నిర్వహించారు. ఈ వేడుకలో అల్లు అర్జున్ 'పుష్ప 2' మేకర్స్ అందరికీ ధన్యవాదాలు తెలిపాడు. అనంతరం ఫ్యాన్స్ గురించి మాట్లాడుతూ.. 'నా ఫ్యాన్స్ అంటే నాకు పిచ్చబ్బా.. వారి కోసం ఎక్కడికైనా, ఎందాకైనా వస్తా. వారి వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను. మీ (ఫ్యాన్స్) ప్రేమకు ఎప్పుడూ రుణపడి ఉంటాను' అని బన్నీ తెలిపాడు. అన్నట్టు ఈ వేడుకలో అల్లు అర్జున్, రష్మిక మందన్నా, శ్రీలీల, దేవిశ్రీ ప్రసాద్ తో సహా చిత్ర బృందం, పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. కాగా మైత్రి మూవీ మేకర్స్ సంస్థ పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ పాన్ ఇండియన్ రేంజ్ లో గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ఈ భారీ బడ్జెట్ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ తో పాటు తమన్ కూడా సంగీతం అందిస్తున్నారు. అన్నట్టు శ్రీలీల, సునీల్, ఫహాద్ ఫాజిల్, అనసూయ భరద్వాజ్ మరియు బ్రహ్మాజీ వంటి తారాగణం ఈ సినిమాలో నటించింది. కాగా ఈ డిసెంబర్ 5న సినిమా గ్రాండ్ గా రిలీజ్ కి రాబోతుంది.




## ఐదుగురు భారత ఆటగాళ్లకు బిగ్ షాక్..

# ఆసక్తి చూపని ఫ్రాంచైజీలు

మెగా వేలం మొదటి రోజు, రిషబ్ పంత్, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్ వంటి ఆటగాళ్లు ముఖ్యాంశాల్లో నిలిచారు. మొత్తం 84 మంది ఆటగాళ్లను వేలం వేయగా, అందులో 12 మంది మాత్రమే మిగిలారు. వీరిని ఏ జట్టు కొనుగోలు చేయలేదు.

**కేన్ మామకు నిరాశే**

కేన్ విలియమ్సన్ (బేస్ ధర రూ. 2 కోట్లు) ఐపీఎల్ మెగా వేలంలో అన్‌సోల్డ్‌గా మారాడు. ఏ ఫ్రాంచైజీ ఈ స్టార్ ప్లేయర్‌ను కొనేందుకు ఆసక్తి చూపలేదు.

**కేకేఆర్‌కు చేరిన రోవ్‌మన్ పావెల్**

రోవ్‌మన్ పావెల్‌ను తీసుకునేందుకు కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు రూ. 1.50 కోట్లు వెచ్చించింది.

**అమ్ముడవ్వని అజింక్య రహానే**

అజింక్య రహాను కూడా కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ధోని మాజీ టీం ప్లేయర్‌కు బిగ్ షాక్ తగిలింది.

**మయాంక్ అగర్వాల్‌కు బిగ్ షాక్**

మయాంక్ అగర్వాల్‌ను కూడా కొనేందుకు ఏ ఫ్రాంచైజీ ఆసక్తి చూపలేదు.

**పృథ్వీ షాకు బిగ్ షాక్**

యంగ్ ప్లేయర్ పృథ్వీ షాకు ఊహించని షాక్ తగిలింది. ఏ ఫ్రాంచైజీ కూడా కొనేందుకు ముందుకు రాలేదు.

**ఢిల్లీకి మారిన ఫాఫ్ డు ప్లెసెస్**

ఫాఫ్ డు ప్లెసెస్ వచ్చే ఏడాది ఢిల్లీ క్యాపిటలర్స్ తరపున ఆడనున్నాడు. ఇందుకోసం డీసీ రూ. 2 కోట్లు ఖర్చు చేసింది.

**గుజరాత్ చేరిన సుందర్**

వాషింగ్టన్ సుందర్ వచ్చే ఏడాది గుజరాత్ టైటాన్స్ చెంతకు చేరాడు. ఇందుకోసం గుజరాత్ రూ. 3.20 కోట్లు ఖర్చు చేసింది.

**చెన్నై చేరిన సామ్ కర్రాన్**

సామ్ కుర్రాన్ వచ్చే ఏడాది చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడనున్నాడు. ఇందుకోసం చెన్నై రూ. 2.40 కోట్లు ఖర్చు చేసింది.

**పంజాబ్ చేరిన మార్కో జాన్సెన్**

మార్కో జాన్సెన్ వచ్చే ఏడాది పంజాబ్ కింగ్స్ తరపున ఆడనున్నాడు. ఇందుకోసం రూ. 7 కోట్లు ఖర్చు చేసింది.

**బెంగళూరు చేరిన కృనాల్ పాండ్యా**

కృనాల్ పాండ్యా కోసం హోరాహోరీ పోరు జరిగింది. చివరకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ. 5.75 కోట్లు ఖర్చు చేసి, సొంతం చేసుకుంది.

## పెర్త్‌లో ఆసీస్‌ను చిత్తు చేసిన

# ఇండియా

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో జస్ప్రీత్ బుమ్రా నేతృత్వంలోని భారత జట్టు ఘన విజయం సాధించింది. ఏకంగా 295 పరుగుల తేడాతో భారత్ గెలిచింది. దాంతో ప్రతిష్ఠాత్మక సిరీస్‌లో ఇండియా టీమ్ 1-0 ఆధిక్యాన్ని నమోదు చేసింది.తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ కేవలం 150 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. దాంతో గెలుపు అసాధ్యమే అనుకున్నారంతా. తర్వాత తొలి ఇన్నింగ్స్ ఆడిన ఆస్ట్రేలియా కూడా 104 పరుగులకే కుప్పకూలింది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆడిన భారత్.. యశస్వి జైస్వాల్ (161 పరుగులు), విరాట్ కోహ్లీ (100 పరుగులు), కేఎల్ రాహుల్ (77 పరుగులు) అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో 487 పరుగుల భారీ స్కోర్ సాధించి మరో మూడు వికెట్లు ఉండగానే డిక్లేర్ చేసింది. అనంతరం 534 పరుగుల భారీ లక్ష్య చేధన కోసం బరిలో దిగిన ఆస్ట్రేలియా కేవలం 238 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. 295 పరుగుల భారీ తేడాతో మ్యాచ్‌ను చేజార్చుకుంది. మరో రోజు మిగిలి ఉండగానే మ్యాచ్ ముగిసింది. భారత్ 1-0 లీడ్ దక్కింది. ఆప్టస్ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. అందుకు తగ్గట్టుగానే ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులకే ఆలౌటైంది. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్ ఆడిన ఆస్ట్రేలియా జట్టు భారత పేసర్ల ధాటికి 104 పరుగులకే ఆలౌటైంది. టీమిండియా తరఫున బుమ్రా 30 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమ్ ఇండియా, కేఎల్ రాహుల్, యస్సవ్ జైస్వాల్ అద్భుతమైన ఆరంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు 201 పరుగుల భాగస్వామ్య తర్వాత రాహుల్ (77) ఔటయ్యాడు. మరోవైపు 297 బంతులు ఎదుర్కొన్న యస్సవ్ జైస్వాల్ 3 సిక్సర్లు, 15 ఫోర్లతో 161 పరుగులు చేశాడు. నాలుగో నంబర్‌లో బరిలోకి దిగిన విరాట్ కోహ్లీ 143 బంతుల్లోనే భారీ సెంచరీని నమోదు చేశాడు. ఈ సెంచరీల సాయంతో టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 487 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగుల లోటుతో 534 పరుగుల లక్ష్యాన్నిఛేదాంచేందుకు బరిలోకి దిగిన ఆసీస్ కు జస్ప్రీత్ బుమ్రా ఆరంభంలోనే షాక్ ఇచ్చాడు. ఫలితంగా 3వ రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా జట్టు 12 పరుగుల వద్ద 3 వికెట్లు కోల్పోయింది. ఇక నాలుగో రోజు ఆరంభంలోనే మహ్మద్ సిరాజ్ ఉస్మాన్ ఖ్వాజా (4), స్టీవ్ స్మిత్ (17) వికెట్లు తీశారు. ఈ దశలో భాగస్వామ్యమైన ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్ అద్భుతమైన బ్యాటింగ్‌ను ప్రదర్శించారు. ఈ దశలో బుమ్రా ట్రావిస్ హెడ్ (89) వికెట్ పడగొట్టగా, నితీశ్ రెడ్డి బౌలింగ్ లో మిచెల్ మార్ష్ (47) అవుటయ్యాడు. ఈ రెండు వికెట్లు పడగొట్టిన టీమిండియా బౌలర్లు మళ్లీ మ్యాచ్‌పై పట్టు సాధించి ఆస్ట్రేలియా జట్టును 238 పరుగులకే ఆలౌట్ చేశారు. దీంతో టీమిండియా 295 పరుగుల భారీ విజయం సాధించి సరికొత్త చరిత్ర సృష్టించింది.









# 'కన్నప్ప' ఏప్రిల్ 25న విడుదల

మంచు విష్ణు ప్రధానపాత్రలో నటించిన భారీ బడ్జెట్ మూవీ 'కన్నప్ప' రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 25న విడుదల చేయనున్నట్లు విష్ణు 'X'లో వెల్లడించారు. ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, మోహన్ బాబు, శరత్ కుమార్ తదితర అగ్రనటులు నటిస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు పెరిగాయి. ముకేశ్ కుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, AVA ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.




# 28న ఓటీటీలోకి లక్కీ భాస్కర్

వెంకీ అట్లూరి డైరెక్షన్‌లో దుల్కర్ సల్మాన్-మీనాక్షి చౌదరి నటించిన 'లక్కీ భాస్కర్' మూవీ ఓటీటీలోకి రానుంది. ఈ నెల 28 నుంచి తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ వెల్లడించింది. గత నెల 31న విడుదలైన ఈ సినిమా రూ.100 కోట్లకుపైగా కలెక్షన్లు సాధించి సూపర్‌హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే.



## మహారాష్ట్ర ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీనామా

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి భారీ మెజారిటీ సాధించింది. అయితే ఇదే ఎన్నికల్లో కాంగ్రెస్ మాత్రం మరోసారి ఘోర పారాజయం పాలైంది. రాష్ట్రంలోని 288 స్థానాలకు గాను కాంగ్రెస్ కూటమిగా ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ కేవలం 16 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. ఈ నేపథ్యంలో పార్టీ ఘోర పరాజయానికి బాధ్యత వహిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా హై కమాండ్ ఇంకా ఆమోదించలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో మహావికాస్ అఘాడీ కూటమి భారీ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. మహారాష్ట్ర అసెంబ్లీలో 101 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 16 స్థానాల్లో మాత్రమే గెలిచి 12.42 శాతం ఓట్లు సాధించింది.

## కోయంబత్తూరులో ఆర్జీవీ?

డైరెక్టర్ ఆర్జీవీ కోయంబత్తూరులో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రకాశం జిల్లా పోలీసుల విచారణకు వెళ్లకపోవడంతో వారు హైదరాబాద్‌లోని ఇంటికొచ్చారు. కాగా, ఆర్జీవీ నిన్న హీరో మోహన్ లాల్‌ను కలిసిన ఫొటో 'ఎక్స్'లో పోస్ట్ చేయడంతో ఆయన షూటింగ్ కోసం వెళ్లినట్లు తెలుస్తోంది. పోలీసులు ఇంటికి రావడంపై ఆర్జీవీ అడ్వకేట్ మండిపడ్డారు. డిజిటల్ విచారణకు సిద్ధంగా ఉన్నామని చెప్పినా పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు.



## లగచర్లకు రేవంత్ వెళ్తుంటే ఉరికించి కొట్టేవారు

**అల్లుడు, అన్న, తమ్ముడి కోసమే రేవంత్ పనిచేస్తుండు..**

ఇదే మానుకోట 14 ఏళ్ల కిందట ఇదే మానుకోట తెలంగాణ ఉద్యమంలో ఓ కీలకమైన మలుపునకు కారణమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ అదే మానుకోట ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ భూములు గుంజుకుంటా ఏం చేసుకుంటారో చేసుకోండి అంటున్న కొత్త నియంతకు బుద్ధిచెప్పేందుకు సిద్ధమైందని తెలిపారు. గిరిజన, దళిత, పేద రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నాడు నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. అసలు ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఏం జరిగిందో ప్రజలు తెలుసుకోవాలని అన్నారు.లగచర్లలో ఉండే బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ ముఖ్యమంత్రి మీద తిరగబడ్డారని కేటీఆర్ తెలిపారు. వారి భూములను తీసుకుంటామని చెబితే మా ఆడబిడ్డలు 9 నెలల పాటు ధర్నా చేసి నిరసన తెలిపారని అన్నారు. 9 నెలలుగా సొంత నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ ముఖ్యమంత్రికి సమయం లేదని విమర్శించారు. కానీ ఎక్కే విమానం దిగే విమానం అన్నట్లుగా 28 సార్లు ఢిల్లీకి పోయిండు.. కనీసం 28 పైసలు కూడా తేలేదని ఎద్దేవా చేశారు. సొంత నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి మీద ప్రజలు తిరగబడుతున్నారని తెలిపారు. మొన్న అధికారులు పోతే ప్రజలు నిరసన తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి పోయి ఉంటే ఉరికించి, ఉరికించి కొట్టేవారని అన్నారు. ఎందుకంటే ఢిల్లీలో రైతులు ఏడాది పాటు ఆందోళన చేసి మోదీ లాంటి వ్యక్తినే నల్ల చట్టాల నుంచి వెనక్కి తగ్గేలా చేశారని గుర్తుచేశారు. రైతుల పవర్ అంటే ఆ విధంగా ఉంటుందని.. అలాంటి పవర్ ఉన్న రైతులతో రేవంత్ రెడ్డి పెట్టుకున్నాడని మండిపడ్డారు. ఫార్మా విలేజ్ ఎవరి కోసమని కేటీఆర్ ప్రశ్నించారు. తన అల్లుడి కోసం రేవంత్ రెడ్డి పేదవాళ్ల భూములను గుంజుకుంటున్నాడని మండిపడ్డారు. ఈ ముఖ్యమంత్రి తన సొంత అల్లుడు, అదానీ, అన్నగాడు, తమ్ముని కోసం తప్ప రాష్ట్ర ప్రజల కోసం పని చేయడం లేదని విమర్శించారు. మరో 10 రోజులైతే రేవంత్ రెడ్డి పాలనకు ఏడాది అవుతుందని గుర్తుచేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. 420 హామీలు ఇచ్చారా? ఒక్క హామీనైనా నెరవేర్చారా? అని ప్రశ్నించారు. ఇక్కడున్న డోర్నకల్, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.






# మహారాష్ట్ర సీఎంగా దేవేంద్ర ఫడ్నవిస్?

మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు ముమ్మరం చేశారు. ఇదిలా ఉంటే మహాయుతిలో సీఎం పదవికి సంబంధించి పెద్ద ఎత్తున వార్తలు వస్తున్నాయి. అందుతున్న సమాచారం ప్రకారం దేవేంద్ర ఫడ్నవీస్‌ను సీఎం చేసేందుకు అజిత్ పవార్ వర్గానికి చెందిన ఎన్సీపీ అంగీకరించింది. ఆదివారం జరిగిన సమావేశంలో దేవేంద్ర ఫడ్నవీస్‌ను సీఎం చేసేందుకు అజిత్ పవార్‌తో పాటు ఆయన ఎమ్మెల్యేలంతా మద్దతు పలికినట్లు సమాచారం. అయినప్పటికీ షిండే శిబిరంలోని వారి ఎమ్మెల్యేలు ఇప్పటికీ సీఎంగా ఏక్‌నాథ్ షిండే ఉండాలని కోరుకుంటున్నారు. ఎందుకంటే లాడ్లీ బ్రాహ్మణ యోజనను సీఎం ఏక్‌నాథ్ షిండే ప్రారంభించారు. ఇది మహాయుతికి మంచి ప్రయోజనం చేకూర్చిందని భావిస్తున్నారు. షిండే వర్గం సీఎం పదవిని డిమాండ్ చేస్తోంది ఏక్‌నాథ్ షిండే సీఎం కావడం వల్ల బీఎంసీ ఎన్నికల్లోనూ, ఇతర మున్సిపల్ ఎన్నికల్లోనూ లాభదాయకంగా ఉంటుందని షిండే క్యాంపు అభిప్రాయపడింది. అదే సమయంలో బీజేపీకి అత్యధిక సీట్లు వస్తాయని, అందుకే దేవేంద్ర ఫడ్నవీస్‌ను బీజేపీ వైపు నుంచి సీఎం చేయాలని బీజేపీ నేతలు కోరుతున్నారు. అయితే ఈరోజు మహాకూటమి పార్టీల నేతలు దేవేంద్ర ఫడ్నవీస్, ఏక్నాథ్ షిండే, అజిత్ పవార్ ఢిల్లీకి వెళ్లి అక్కడ అమిత్ షా, జేపీ నడ్డాలను కలవనున్నారు.

ఒక సీఎం, ఇద్దరు డిప్యూటీ సీఎంల ఫార్ములా

ఈ క్రమంలో మహారాష్ట్రలో ఒక సీఎం, ఇద్దరు డిప్యూటీ సీఎంల ఫార్ములా మళ్లీ రిపీట్ కావచ్చని విశ్వసనీయ వర్గాల సమాచారం. దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రి కావడం దాదాపు ఖాయం. ఫడ్నవీస్‌ను సీఎం చేయడానికి మహాయుతిలో అజిత్ గ్రూపు నుంచి ఎలాంటి అభ్యంతరం లేదు. అయితే ఈరోజు ఫడ్నవీస్, షిండే, అజిత్ పవార్ ఢిల్లీకి వెళ్లవచ్చు. ఫడ్నవీస్ సీఎం అయితే ఏకనాథ్ షిండే, అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులు కావచ్చని అంటున్నారు. అంటే ఒక సీఎం, ఇద్దరు డిప్యూటీ సీఎంల పాత ఫార్ములానే అమలు చేసే అవకాశం ఉంది.

**మరోసారి సీఎం పదవి**

ఇది కాకుండా బీజేపీ కోటాలో దాదాపు 20-22 మంత్రి పదవులు రానున్నాయి. అయితే సీఎం షిండే లాడ్లీ బ్రాహ్మణ పథకం తీసుకొచ్చి రెండున్నరేళ్లు మంచి పని చేశారని, కాబట్టి మొదట్లో ఆయనకు మరోసారి సీఎం పదవి దక్కాలని షిండే శివసేన కోరుతోంది. ఇప్పుడు ఏకనాథ్ షిండే, అజిత్ పవార్ తమ తమ పార్టీల నాయకులుగా ఎన్నికయ్యారు.

## శబరిమలకు పోటెత్తిన భక్తులు.. 9 రోజుల్లో రూ.41 కోట్ల ఆదాయం



శబరిమల అయ్యప్ప ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. మండల దీక్ష చేసిన అయ్యప్ప దీక్షా స్వాములతోపాటు వేలాదిగా భక్తులు శబరిమలకు తరలివస్తున్నారు. దీంతో శబరిగిరులు అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగుతున్నాయి. గతేడాది ఇదే సమయంలో రూ.28.3 కోట్లు ఆదాయం రాగా.. ఈ సారి అది రూ.41.64 కోట్లకు పెరిగినట్లు తెలిపింది. గతేడాదితో పోలిస్తే ఇది రూ.13.33 కోట్ల ఎక్కువ అని వెల్లడించింది. ఇక భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వండిపెరియార్ సత్రం, ఎరుమేలి, పంబాలలో మూడు ఆన్‌లైన్ బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దర్శనం లేకుండా ఏ భక్తుడు కూడా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి లేదని అన్నారు.



## సైకిల్‌పై పార్లమెంటుకు టీడీపీ ఎంపీ అప్పలనాయుడు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఇవాళ (సోమవారం) సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లారు. పసుపు రంగు సైకిల్‌పై పసుపు రంగు అంగీ, తెల్ల దోవతి, తలకు తలపాగా ధరించి ఆయన పార్లమెంటుకు చేరుకున్నారు.అయితే అప్పల నాయుడు ఆ విధంగా పార్లమెంట్ వెళ్లడం వెనుక ఒక బలమైన కారణం ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం పెరిగిపోతుంది. దట్టంగా పొగమంచు కమ్ముకుని ఉదయం తొమ్మిదింటి వరకు కూడా ఏమీ కనపడని దుస్థితి నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అప్పలనాయుడు గుర్తుచేశారు.



## విపక్షాలపై ప్రధాని మోదీ మండిపాటు

రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అవుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గుర్తు చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు పార్లమెంట్ వెలుపల మీడియా పాయింట్ వద్ద ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా విపక్ష ఇండియా కూటమిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రజలచే తిరస్కరణకు గురైన కొందరు గూండాయిజం ద్వారా పార్లమెంట్‌ను నియంత్రించేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. దేశ ప్రజలు వారి చర్యలన్నింటినీ లెక్కిస్తారని.. సరైన సమయంలో శిక్ష విధిస్తారని వ్యాఖ్యానించారు.'కొందరు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పని చేస్తున్నారు. ప్రజలచే తిరస్కరణకు గురైన కొందరు గూండాయిజం ద్వారా పార్లమెంటుపై నియంత్రణకు ప్రయత్నిస్తున్నారు. సొంత లబ్ధి కోసం పార్లమెంటు సమావేశాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. దేశ ప్రజలు వారి చర్యలన్నింటినీ లెక్కిస్తారు. సరైన సమయంలో ప్రజలే శిక్ష విధిస్తారు. పార్లమెంట్‌లో సానుకూల చర్చలు జరగాలని కోరుకుంటున్నా' అని మోదీ వ్యాఖ్యానించారు. ఈ పార్లమెంట్ సమావేశాలు ఎన్నో అంశాలపరంగా ముఖ్యమైనవని ప్రధాని అన్నారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి నవంబర్ 26 నాటికి 75వ ఏడాదిలోకి అడుగుపెడుతున్నామన్నారు.

## ఏడాదిన్నర కూతురుతో కలిసి చెరువులో దూకిన తండ్రి

నిజామాబాద్ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. తండ్రి, కూతురు చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ విషాదకర సంఘటన నిజామాబాద్ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్‌లోని ఇంద్రాపూర్‌కు చెందిన రఘుపతి ఏడాదిన్నర కూతురు నేహ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నది. కూతురు అనారోగ్యంతో మనస్థాపం చెందిన రఘుపతి నిజామాబాద్ శివారులోని న్యాల్క మాసాని చెరువులో కూతురితో కలిసి చెరువులో దూకాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సహకారంతో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## నా మాజీకి ఖరీదైన గిఫ్ట్‌లు ఇచ్చా

హీరోయిన్ సమంత, వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ'. కాగా అమెజాన్ ప్రైమ్ వేదికగా నవంబర్ 7 నుంచి ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ అయింది. అయితే, 'సిటడెల్ హనీ బన్నీ' ప్రమోషన్స్‌లో భాగంగా వరుణ్ ధావన్ తో కలిసి సరదా చిట్‌చాట్‌లో పాల్గొంది సమంత. కాగా ఈ 'స్పైసీ రాపిడ్ ఫైర్'లో ఎదుటి వ్యక్తి అడిగిన ప్రశ్నకు ఇష్టమైతే సమాధానం చెప్పాలి, లేదంటే పచ్చిమిర్చి తినాలి. ఈ క్రమంలో వరుణ్ ధావన్ ప్రశ్న అడుగుతూ.. "అవసరం లేకపోయినా మీరు అత్యధిక మొత్తంలో దేని కోసం ఖర్చు పెట్టారు?" అని ప్రశ్నించాడు. ఈ ప్రశ్నకు సమంత సమాధానం ఇస్తూ.. 'నా మాజీకి ఇచ్చిన ఖరీదైన కానుకులు" అని సమంత బదులిచ్చారు. "ఎంత ధర ఉంటుంది?" అని అడగ్గా.. "కాస్త ఎక్కువే.. ఇక కొనసాగిద్దాం" అంటూ సమంత ఈ టాపిక్ ను ముగించింది. సమంత చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. స్పై, యాక్షన్ థ్రిల్లర్ గా ఈ 'సిటడెల్: హనీ బన్నీ' సిరీస్ ను రాజ్ అండే డీకే దీనిని తెరకెక్కించారు. ఈ సిరీస్ ప్రపంచవ్యాప్తంగా 200 దేశాల్లో ప్రసారమతుండగా.. 150 దేశాల్లో టాప్‌లో ఉంది.